ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 23.0




దేవర గోపవరంలో చెరువు తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ (ఫైల్)

అక్రమ చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధం

ఏలూరు, మార్చి 9 : కొల్లేరు సరస్సులో అక్రమంగా చెరువుల తవ్వకాలకు అధికార పార్టీకి చెందిన కొందరు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలకు సిద్ధం అంటూనే మరోవైపు కొల్లేరులో ఆక్రమణలకు మేము సిద్ధంమంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. నిడమర్రు మండలం దేవర గోపవరంలో ఐదో కాంటూరు పరిధిలోని కొల్లేరులో గల దాళ్వా వ్యవసాయ భూముల్లో చెరువుల తవ్వకాలు చేపట్టే నిమిత్తం వారం రోజుల క్రితం అర్ధరాత్రి రెండు పెద్ద ఎక్స్‌కవేటర్లను తరలించారు. దీనిపై స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్ఐ సిబ్బందితో వచ్చినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రైతులు ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి

» అధికారులకు తెలిపినా పట్టించుకోని వైనం

వచ్చి ఎక్స్‌కవేటర్లను సీజ్ చేయడం గానీ, బాధ్యులపై కేసు నమోదు చేయడం చేయకుండా విషయం సర్దుబాటు చేశారు. అధికారులు మామూళ్ల మత్తులో ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతుల ఆరోపిస్తున్నారు. ఓ పక్క అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ హడావిడిలో ఉంటారని గుట్టుచప్పుడు కాకుండా చెరువులు తవ్వేసుకోవచ్చని అధికార పార్టీ నాయకులు కుయుత్తులు చేస్తున్నారని దీనికి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సహకరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పంచారామ క్షేత్రమైన భీమవరం గునుపూడిలోని సోమేశ్వరస్వామి రథోత్సవం శనివారం కన్నుల పండువలా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మూర్తులైన సోమేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం : డీపీవో



ఏలూరు కలెక్టరేట్, మార్చి 9 : ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపర్చడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, జిల్లా స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. ఏలూరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర అంశంపై ఫెయిడ్‌న్యూస్, మీడియా సర్టిఫికేషన్, మోనటరింగ్ అంశాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బందికి శిక్షణ నిర్వహించి పవర్ పాయింట్ ప్రజన్‌టేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఫేక్‌న్యూస్ కాకుండా వాస్తవిక దృష్టితో వార్తలు ప్రసారమయ్యేలా మీడియా ముఖ్య భూమిక పోషించాలన్నారు. పౌర సంబంధాధికారి ఆర్.వి.ఎస్ రామచంద్రరావు మాట్లాడుతూ మీడియా సెంటర్ ద్వారా ఎన్నికల సమాచారాన్ని అందిస్తామన్నారు. జిల్లా ఎంసీఎంసీ కమిటీ సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, బి.మధుసూర్యప్రకాష్, వివిధ పత్రికల, న్యూస్ ఛానెల్స్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్లకు స్థలాలు ఇవ్వం..

» కుల సంఘాలకు వైసీపీ ప్రభుత్వం ఝలక్

» అయా కుల సంఘాల నాయకుల ఆగ్రహం

ఏలూరు టూటౌన్, మార్చి 9 : కుల సంఘాలకు వైసీపీ ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాల నిర్మాణానికి స్థలాలు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పింది. ముందుగా అందరికి స్థలాలు ఇస్తామని సర్వే నెంబర్లతో సహా చూపించారు. తీరా కోర్టు తీర్పుల ప్రకారం స్థలాలు ఇవ్వడం కుదరదని చెప్పారు. దీంతో కులసంఘాలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గౌడ, తూర్పుకాపు, ఆర్యవైశ్య, కొప్పుల వెలమ కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్ళు, కల్యాణ మండపాలకు స్థలాలు ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే ఆళ్ళ నాని హామీ ఇచ్చారు. తంగెళ్ళమూడిలో ఆర్ఎస్ నెంబర్ 119/1బీలో డీటీసీపీ లేఅవుట్‌లో రిజర్వ్‌డ్ ఓపెన్ స్థలాన్ని గుర్తించారు. నాలుగు కుల సంఘాలకు ఒక్కొక్కరికి వెయ్యి గజాలు చొప్పున, మెడికల్ అసోసియేషన్‌కు ఆర్ఎస్ నెంబర్ 40లో 800 గజుల స్థలం ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయం నగర పాలక సంస్థకు అప్పజెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు రికార్డులు పరిశీలించి కమ్యూనిటీ హాళ్లకు, కల్యాణ మండపాలకు స్థలాలు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చినట్టు తెలిపారు. ఇదే విషయాన్ని ఈ నెల 6న నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో పెట్టి తీర్మానించారు. స్థలాలు ఇవ్వకూడదని ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియదా..? అంటూ కులసంఘాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేము ఇవ్వాలనుకుంటున్నాం కానీ కోర్టు తీర్పుల వల్ల ఇవ్వలేకపోతున్నామని రేపు ఎన్నికల ప్రచారంలో చెప్పుకోవడానికి ఇలా చేశారని వాపోతున్నారు.

పిచ్చివాళ్లు అనుకుంటున్నారా..?



ఆర్యవైశ్యులను పిచ్చివాళ్లను చేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న స్థలాన్ని ఇవ్వకూడదని ముందే తెలియదా..? తెలిసే ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నాటకాలడుతున్నారు. ఇదంతా ఎన్నికల స్టంట్.

- శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘ నాయకుడు

స్థలాన్ని కొనుగోలు చేసి ఇవ్వాలి..



కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడానికి స్థలం ఇచ్చినట్లే ఇచ్చి కోర్టుతీర్పు వంకలు పెట్టి వెనక్కి తీసుకోవడం తగదు. ప్రభుత్వం స్థలాన్ని కొనుగోలు చేసి ఇవ్వాలి.

- బెల్లంకొండ కిషోర్, గౌడసంఘ నాయకుడు

రెండు నాల్కల ధోరణి తగదు..



ఒక పక్కన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థలం ఇవ్వ డానికి వీలులేదని చెబుతూనే మరలా తాత్కాలికంగా భవనాలు నిర్మించుకోండి అని చెప్పడంలో అర్థమేమిటి. రెండు నాల్కల ధోరణి తగదు. చందాలు వసూలు చేసి లక్షలాది రూపాయలతో బిల్డింగులు కట్టిన తర్వాత ఎవరైన కోర్టుకు వెళ్తే మా పరిస్థితి ఏమిటి.

- ఆర్నేపల్లి మధుసూదనరావు, కొప్పులవెలమ సంఘం నాయకుడు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్ళ, కల్యాణ మండపాలు నిర్మించుకోవడానికి స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ప్రభుత్వానికి నిజంగా ఇవ్వాలని ఉంటే వివా దాలు లేని స్థలం చూపించండి. మేమే ప్రభుత్వ ధరలకు కొనుక్కొని దానిలో భవనాన్ని నిర్మించుకుంటాం.

- బొరోతు బాలాజీ, తూర్పుకాపు సంఘ నాయకుడు

పొత్తు..ఎత్తు

టీడీపీ-జనసేన-బీజేపీ మూడు పార్టీల కలయికతో పొత్తు పొడిచింది. ఇప్పటి వరకు కొనసాగిన సందిగ్ధతకు తెరపడింది. అధికార వైసీపీకి ముచ్చెమటలు పట్టించేలా ఉమ్మడిగా ఎత్తుగడలు. ఎవరు, ఎక్కడ, ఏ ఏ స్థానాల్లో పోటీ చేయాలన్న దానిపై పట్టువిడుపులో మూడు పార్టీలు ఉన్నాయి. దీనికి తగ్గట్టుగానే రాబోయే రెండ్రోజుల్లో తుది నిర్ణయం వెలువడనుంది.

మూడు పార్టీల కూటమి అదుర్స్

» ఎంపీ స్థానాలపైనే పూర్తి ఉత్కంఠ

» తపనాచౌదరి, రఘురామ పోటీపైనే దృష్టంతా

» జనసేన అభ్యర్థులు దాదాపు ఖరారు

» దెందులూరు స్థానంపైనా కీలక నిర్ణయం

» రెండ్రోజుల్లో ఉమ్మడి జాబితా ప్రకటన

» అధికార వైసీపీలో ముచ్చెమటలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు, నరసాపురం లోక్‌సభా స్థానాలు ఎవరికి కేటాయిస్తారనే దానిపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. ఆది నుంచి ఏలూరు లోక్‌సభ స్థానం బీజేపీకి కేటాయిస్తారని, ఇక్కడ సీనియర్ నేత తపనచౌదరి పోటీ చేస్తారని భావించారు. ఇప్పుడు మూడు పార్టీలు ఎన్నికల పొత్తుకు వీలుగా సంసిద్ధం కావడంతో ఏలూరుపై అందరి దృష్టి పడింది. ఏలూరు లోక్‌సభ స్థానం బీజేపీ ఆశిస్తే, నరసాపురం వదులుకోవలసి వస్తుందని కొందరు, నరసాపురాన్ని బీజేపీ కావాలని పట్టుబడితే ఏలూరును వదులుకోవాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో తపనా చౌదరి, సిటింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు పేర్లు అన్ని పార్టీల మధ్య నానుతున్నాయి. ఏలూరు లోక్‌సభ స్థానం దక్కకపోతే తపన చౌదరి ఏదైనా అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి వీలుగా ప్రతిపాదిస్తారని భావిస్తున్నారు. దీనిలో భాగంగానే కైకలూరు నుంచి పోటీకి వీలుగా ప్రతిపాదిస్తారని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ స్థానంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ బీజేపీ ఆశావహుడిగా వున్నారు. నరసాపురం స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే అక్కడి నుంచి పోటీకి వీలుగా రఘురామకృష్ణంరాజు సంసిద్ధంగా వున్నారు. ఇదే స్థానం నుంచి బీజేపీ కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస రాజు పోటీలో వున్నారు. తనకన్ని అర్హతలూ ఉన్నాయని, తన అభ్యర్థిత్వాన్ని పార్టీ సీరియస్‌గా తీసుకుంటుందన్న నమ్మకంతో ఆయన వున్నారు. ఎంపీ స్థానాలు కీలకం కావడంతో బీజేపీ ఆచితూచి వ్యవహరిస్తోంది. పొత్తులో స్థానాలన్నిటిపైన రెండ్రోజుల్లోనే ఒక స్థిరాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది.



పవన్ పోటీ ఎక్కడ ?

మూడు ప్రధాన రాజకీయ పక్షాలూ రానున్న రాజకీయ సంగ్రామంలో ఉమ్మడిగా పోటీ చేసేందుకు ఒక నిర్ణయానికి వచ్చాయి. సీట్ల సర్దుబాటు మీద ఢిల్లీలో ఉన్నతస్థాయి చర్చ సాగింది. అందరికీ ఆమోదయోగ్యంగా ఒక సంఖ్యను నిర్ధారించారు. మూడు పార్టీల ఉమ్మడి పొత్తు, పోటీ ఇక గోదావరి జిల్లాల్లో అధికార వైసీపీకి ముచ్చెమటలు పట్టించబోతున్నాయి. జనసేనకు పొత్తులో భాగంగా ఉమ్మడి పశ్చిమలో ఆరు అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు నుంచి ధర్మరాజు, పోలవరం నుండి చిర్రి బాలరాజు అభ్యర్థిత్వాలు ప్రకటిస్తారని భావిస్తున్నారు. పోలవరంలో బాలరాజుతోపాటు మరికొందరు తుది ప్రయత్నాల్లో ఉన్నారు. వీరిలో ఉన్నత చదువులు అభ్యసించిన మొడియం సూర్యచంద్రరావు జనసేన టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తన తాత పోలవరం ఎమ్మెల్యేగా పనిచేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సూర్యచంద్రరావుతోపాటు విద్యావంతురాలైన కణితి అశ్విని పేరు తరచూ ప్రసార మాధ్యమాల్లో నానుతోంది. గత ఎన్నికల్లో చిర్రి బాలరాజు పోటీ చేసిన అనుభవం ఉండడంతో ఆయన వైపే పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతోందని భావిస్తున్నారు. ఈ రెండు స్థానాలకు సంబంధించి కీలక ప్రకటన రెండు రోజుల్లో పవన్ కల్యాణ్ ప్రకటించబోతున్నారు. తాడేపల్లిగూడెం, నిడదవోలు, నరసాపురం నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు ఇప్పటికే ఖరారై వున్నందున ఈ స్థానాలకు దాదాపు ఒక స్పష్టత వచ్చింది. ఇక ఎటు తిరిగి భీమవరం నుండి పవన్ కల్యాణ్ ముందుగా పోటీ చేస్తారనుకున్నా, ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు చెబుతున్నారు. తన స్థానంలో మాజీ ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబును అభ్యర్థిగా ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఇప్పటికే దీనికి అనుకూలంగా జనసేన పూర్తిగా సంకేతాలు పంపడంతో ఇప్పటి వరకు దాకా టీడీపీలో వున్న ఆ పార్టీ కార్యకలాపాల్లో అంటీ ముట్టనట్లుగా వుంటున్న అంజిబాబు నేరుగా జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన జనసేనకు వర్తమానం పంపడం, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఇప్పటికే వెల్లడించారు. ఇక సూత్రప్రాయంగా జనసేనలో చేరాల్సి వుంది. భీమవరం నుంచి తమ పార్టీ అధ్యక్షుడు పవన్ పోటీ చేస్తారని ఆయన అభిమానులతోపాటు మిగతా పార్టీలు ఊహించినా, దీనికి భిన్నంగా పవన్ అడుగులు వేస్తున్నారు. గడచిన రెండు రోజులుగా పవన్ కల్యాణ్ పార్లమెంట్ వైపే దృష్టి పెట్టారని, ఉభయ గోదావరి జిల్లాల్లో ఏదో ఒక స్థానం నుండి పోటీ చేయబోతున్నారని విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనిపై జనసేనలోనూ తర్జనభర్జన, అనేక ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమలోనే తమ పార్టీ ఆశించినట్లుగా ఆరు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అవకాశం రావడం దీనిని నిలబెట్టుకుని విజయం సాధించడం ద్వారా గోదావరి జిల్లాల్లో నిలదొక్కుకోవాలనే కాంక్ష ఆ పార్టీలో స్పష్టంగా కనిపిస్తోంది.

సీనియర్లకు చంద్రబాబు దిశా నిర్దేశం

టీడీపీ తన పట్టున్న స్థానాలను జనసేనకు కేటాయించడం ఆయా నియోజకవర్గాల్లో పార్టీ సీనియర్లను సర్దుకుపోవాలని ఉమ్మడి పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునివ్వడం ఇంకో పరిణామం. తెలుగుదేశం దెందులూరు స్థానం నుంచి ఎవరిని పోటీకి దింపబోతుందో సోమవారం స్పష్టత ఇవ్వబోతోంది. సాధ్యమైనంత మేర చింతమనేని ప్రభాకర్‌కు అవకాశం వస్తుందని ఆయన అనుచరవర్గం ధీమాతోనే ఉంది. ఇంకోవైపు గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఇప్పటికే వెంకట్రాజు గోపాలపురంలో వైసీపీ అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనితను మించి ఓటర్లను కలవడంలో పోటీ పడుతున్నారు. యువకుడైన తనకు అందరి మద్దతు ఉందని, విజయం తనవైపే ఉంటుందని ధీమాతో ఉన్నారు. ఇదిలా ఉండగా, ఓ వైపు బుజ్జగింపుల పర్వం సాగుతున్నా.. టీడీపీ కేడర్ మాత్రం కొంత అసంతృప్తి, ఇంకొంత ఆగ్రహంతోనే ఉంది. ఇప్పటికే పోలవరంలో బొరగం శ్రీనివాస్, తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జీతో పార్టీ అధినేత చంద్రబాబు నేరుగా సంభాషించినా, ఆయా నియోజకవర్గాల్లో కేడర్ మాత్రం తాజా నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయి. బుట్టాయగూడెంలో సమావేశమైన పోలవరం టీడీపీ కేడర్, తాడేపల్లిగూడెంలో సమావేశమైన కార్యకర్తలలో అత్యధికులు పార్టీ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని పట్టుబడుతున్నారు.

• కైకలూరు వైసీపీకి బిగ్ షాక్ : ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా : వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి నోబుల్



కైకలూరు, మార్చి 9 : కైకలూరు నియోజకవర్గంలో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఎస్సీ సామాజిక వర్గంలో పట్టున్న నాయకుడు పార్టీపై తిరుగుబాటు చేశారు. పార్టీ కోసం పనిచేసి ఎన్నో అవమానాలకు గురయ్యానని దళిత నాయకుడు, వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బొడ్డు నోబుల్ ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం కైకలూరులో దళితుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ 'నియోజకవర్గంలో వైసీపీ కోసం కష్టపడి పనిచేశా. ఎక్కడా ఏ తప్పు చేయలేదు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుతో ఎన్నో అవమానాలు పొందా. ఇందువల్లే పార్టీ కార్యక్రమాలకు కొంత కాలం దూరంగా ఉన్నా. ఎమ్మెల్యే ఒక సమావేశంలో నన్ను బూతులు తిట్టారు. వార్డు సభ్యునిగా కూడా గెలవలేనని అవమానపరిచారు. నేను గతంలో ఎంపీటీసీగా గెలుపొందా. కాంగ్రెస్ బ్లాక్-1 అధ్యక్షునిగా పనిచేశా. అభిమానులంతా ఆశీర్వదిస్తే వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా'నని నోబుల్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూషించిన మాటల ఆడియోను వినిపించారు. నాయకులు అర్జా యోహన్, బండి ప్రసాద్, కురేళ్ళ ఇస్సాక్, గూడపాటి వరప్రసాద్, రత్నకుమార్, దండే సైమన్‌రాజు, తేరా రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొరగం శ్రీనివాస్

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా

» టీడీపీ పోలవరం ఇన్‌చార్జ్ బొరగం

బుట్టాయగూడెం, మార్చి 9: పార్టీ అధిష్ఠానం పోలవరం సీటు కేటాయింపులో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం బొరగం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి త్యాగాలకు సిద్ధంగా ఉండాలని చెప్పడంతో శనివారం బుట్టాయగూడెంలో నియోజకవర్గ నాయకులు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేశారు. పార్టీకి కంచుకోటలా నిలిచిన పోలవరం సీటును బొరగంకు ఇవ్వకుంటే మూకుమ్మడి రాజీనామలకు సిద్ధపడతామని నాయకులు పేర్కొన్నారు. పొత్తు ధర్మానికి తాము వ్యతిరేకం కాదని, విజయం సాధించగలిగిన అభ్యర్థికే సీటును కేటాయించాలని నినాదాలు చేశారు. 2019లో పార్టీ ఓటమి చెందిన నాటి నుంచి నేటి వరకు బొరగం ప్రజల్లోనే ఉంటూ పార్టీకి అభివద్ధికి కృషి చేశారని, ఈసారి ఆయనదే విజయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ విజయం సాధించగల అభ్యర్థుల విషయంలో అధిష్ఠానం పునఃపరిశీలన చేసి సీటును తనకే ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీటు విషయంలో నాయకులు, కార్యకర్తల నిర్ణయాన్ని గౌరవిస్తానని స్పష్టం చేశారు. ఇక్కడి అందరి అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళి టీడీపీకే సీటు వచ్చేలా ప్రయత్నాలు చేద్దామని నాయకులు స్పష్టం చేశారు. సమావేశంలో శీలం వెంకటేశ్వరావు, పారేపల్లి రామారావు, ఉండవల్లి సోమసుందరం, గద్దె అబ్బులు, షేక్ సుభాని, చింతల వెంకటరమణ, మొగపర్తి సోంబాబు, యంట్రప్రగడ శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

బాబ్జికి బాబు భరోసా

» బొలిశెట్టికి లైన్ క్లియర్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం-జనసేన కూటమి పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని ఏ పార్టీకి కేటాయిస్తారు ? అన్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. చివరకు ఆయా పార్టీల అధిష్ఠానాలు జనసేనకు కేటాయించారు. టీడీపీకి ఖరారవుందని పార్టీ శ్రేణులు తొలి నుంచి ఆశిస్తూ వచ్చాయి. కారణాలు ఏమైనా గడచిన 20 ఏళ్లుగా తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం జెండా ఎగురలేదన్న ఆవేదన పార్టీ కార్యకర్తల్లో ఉంది. అందుకే ఈసారి టీడీపీ విజయం తథ్యమంటూ ధీమాతో ఉన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి పార్టీని ఒక స్థాయికి తీసుకువెళ్లారంటూ అధిష్ఠానం గుర్తించింది. అయితే పొత్తుల్లో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించారు. జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్‌కు లైన్‌క్లియర్ అయ్యింది. అయితే ఈ నియోజకవర్గాన్ని బీజేపీ ఆశిస్తుందన్న ప్రచారం సాగుతోంది. బీజేపీతో పొత్తు ఉంటుందంటూ ప్రయత్నాలు సాగుతున్నప్పుడే గతంలో నెగ్గిన సీట్లను తమకు కేటాయించాలంటూ ఆ పార్టీ ప్రతిపాదించింది. అయినా పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వాలని నిర్ణయిం చారు. బీజేపీ ప్రయత్నిస్తున్నా ఈ స్థానంపై పవన్ పట్టుదలతో ఉన్నారు. జనసేనకు సీటు కేటాయించిన విషయమై టీడీపీ అధినేత చంద్రబాబు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జితో ఫోన్‌లో మాట్లాడారు. గూడెం విషయంపై బాబ్జితోపాటు, కేడర్‌కు భరోసా ఇచ్చేలా బాబు హామీ ఇచ్చినట్టు సమాచారం.


సమావేశంలో మాట్లాడుతున్న వలవల బాబ్జి

బాబు మాటను గౌరవించాలి

» తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జ్ వలవల

» బాబ్జికి కచ్చితమైన భరోసా కావాలి : శ్రేణులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 9 : తాడేపల్లిగూడెం టిక్కెట్‌ను టీడీపీకి ఇవ్వకపోవడంపై నాతో సహా పార్టీ శ్రేణులందరూ మదనపడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు మాటను ప్రతీ ఒక్కరూ గౌరవించాలి. త్వరలోనే అధినేత చంద్రబాబు వద్ద వెళ్లి ఆయన వద్ద నుండి భరోసా తీసుకుందామన్నారు. స్థానిక మాగంటి కల్యాణ మండపంలో శనివారం జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 'టిక్కెట్ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబు ఢిల్లీ నుంచి నాతో పావు గంటసేపు ఫోన్‌లో మాట్లాడారు. పొత్తులో భాగంగా టీడీపీ టికెట్‌ను ఇతర పార్టీకి ఎందుకు కేటాయించవలసి వచ్చిందో చెప్పారు. నాకు ఎమ్మెల్సీ ఇచ్చి, ఎలాంటి ఇబ్బంది చూస్తానంటూ భరోసా ఇచ్చారు. నాకు పదవులు ముఖ్యం కాదు. కార్యకర్తల వేదనను అర్థం చేసుకోమని అధినేతను కోరా. నియోజకవర్గ ముఖ్యనేతలతో కలిసి నన్ను రమ్మని చెప్పారు. చంద్రబాబుతో మాట్లాడిన తర్వాత అందరూ కలిసి ఒక నిర్ణయానికి వద్దాం. అంత వరకు పార్టీ శ్రేణులు ఎవరూ కంగారు పడవద్దు' అని బాబ్జి అన్నారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు తమ మనోవేదనను నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబుకు వివరించారు. నాలుగున్నరేళ్లుగా బాబ్జి పార్టీ శ్రేణులకు అండగా నిలిచారన్నారు. ఇప్పుడు పొత్తు అంటూ సీటు వేరే పార్టీకి ఇస్తున్నారని, తమకు ఇక అండగా ఎవరుంటారంటూ ప్రశ్నించారు. శారీరంగా, ఆర్థికంగా ఒడిదుడుకులను ఎదుర్కొన్న బాబ్జికి కచ్చితమైన భరోసా కావాలన్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకూ పార్టీ నిర్దేశించిన ప్రతీ కార్యక్రమాన్ని బాబ్జి శ్రద్ధగా చేశారన్నారు. కార్యకర్తల ఆవేదన పార్టీ అధిష్టానానికి తెలియజేస్తానని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్ పాతూరి రాంప్రసాద్‌చౌదరి, వాడపల్లి సుబ్బరాజు, రాంలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు పాలి ప్రసాద్ ఇక లేరు



ఏలూరు టూ టౌన్, మార్చి 9: టీడీపీ సీనియర్ నాయకుడు, ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్(71) ఇకలేరు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన జెండా సభకు హాజరై సందర్భంలో ఓ కారు ఢీకొనడంతో ఆయన తుంటి ఎముక విరిగింది. తాడేపల్లిగూడెంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు మహాలక్ష్మి ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతుండగా ఆరోగ్యం క్షీణించి శనివారం మృతి చెందారు. 40 ఏళ్లుగా టీడీపీ బలోపేతం కోసం ఎనలేని కృషిచేశారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించడంతో అప్పటి నుంచి పార్టీ కొనసాగుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయాల చైర్మన్‌గా, టీడీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బడేటి చంటి సహా పలువురు ప్రసాద్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీకి ఆయన చేసిన సేవలు కొనియాడారు.


పాలి ప్రసాద్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న బడేటి చంటి



ఓటుహక్కు వినియోగించుకుంటున్న సభ్యులు

ప్రశాంతంగా అంజుమన్ సంస్థ ఎన్నికలు

ఏలూరు రూరల్, మార్చి 9: ఏలూరు అంజుమన్ సంస్థ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సంస్థకు ఎన్నికలు జరిగి మూడేళ్లు పూర్తి అయింది. గత పాలకవర్గం సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో మరోవర్గం ఎన్నికలు నిర్వహించాలంటూ పట్టుబట్టింది. ఈ క్రమంలో అడ్‌హక్ కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. అడ్‌హక్ కమిటీ సైతం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇటీవల అంజుమన్ సంస్థ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశారు. మార్చి 1వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. శనివారం ఎన్నికలు నిర్వహించారు. సంస్థకు 2773 మంది ఓటర్లు ఉన్నారు. వీరు 28 మంది ఈసీలను ఎన్నుకుంటారు. ఈసీలు అధ్యక్షుడిని, కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా చెదలవాడ వెంకటరమణ, ఉప్పులూరి హేమ శంకర్ వ్యవహరించారు. అయితేఈ ఎన్నికలు బైలాప్రకారం నిర్వహించడం లేదంటూ ఇటీవల మాజీ ఈసీ సభ్యుడు మస్తాన్‌పాషా, ఏలూరు జిల్లా కోర్టులో కేసు దాఖలు చేశారు. బైలా ప్రకారం ఎన్నికలు జరపడం లేదని, ఓటర్లలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ ఫిర్యాదు చేశారు. దీంతో న్యాయమూర్తి ఎన్నికలు నిర్వహించి ఫలితాలు వెల్లడించ వద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఎన్నికలు పూర్తి అయినా ఫలితాలు మాత్రం వెల్లడించలేదు. పాత, కొత్త ఓటర్‌లిస్ట్‌ను తమ ముందు పెట్టాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉదయం జరిగిన ఎన్నికలకు సంబంధించి ఫలితాలు త్వరలో వెల్లడించనున్నారు.

వైద్య ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 9 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లో బాగంగా తొలివిడతగా ప్రభుత్వం నుంచి అందిన జాబితాలోని మొత్తం 185 మంది ఉద్యోగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శనివారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగింది. ఎంపీహెచ్‌ఏ (మేల్) 114 మంది, ల్యాబ్ టెక్నీషియన్ 1, ఫార్మసిస్టులు 9, ఏఎన్‌ఎంలు 61మంది హాజరు కాగా, వీరందరు క్రమబద్ధీకరణ నిబంధనల ప్రకారం అండర్ టేకింగ్ బాండ్‌లను సంబంధిత పీహెచ్‌సీల నుంచి తీసుకుని రెండు రోజుల్లోగా ఇవ్వాల్సిఉంటంది. కాగా ఉమ్మడి జిల్లాలో క్రమబద్ధీకరణకు అర్హులైన మరో 58 మంది ఉద్యోగులకుకూడా ప్రభుత్వ జీవోలు సోమ లేదా మంగళవారాల్లో విడుదలయ్యే అవకాశం ఉంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట పర్యవేక్షించారు. రెగ్యులరైజేషన్ ఆర్డర్లను కలెక్టర్ ద్వారా అందజేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

పకడ్బందీగా పది పరీక్షలు

18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 9 : ఎటుచూసినా ఎన్నికల ఫీవర్ వేడెక్కుతున్న వేళ విద్యార్థులకు కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. మరో ఎనిమిది రోజుల వ్యవధిలోనే ఈనెల 18 నుంచి 30 వరకు జరగనున్న టెన్త్ పరీక్షలు ఈ ఏడాది నుంచి కొత్త జిల్లాల ప్రాతిపదికనే నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తయి పరీక్షలకు బాలబాలికలు సిద్ధపడుతుండగా, ఆ మేరకు శాఖాపరంగా జిల్లావిద్యాశాఖ క్షేత్రస్థాయి ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రశ్నాపత్రాలు, పరీక్షల సామగ్రిని జిల్లాలోని 31 స్టోరేజీ పాయింట్లకు ఈనెల 12, 13 తేదీల్లో రెండు విడతల్లో తరలించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

అన్ని పరీక్షా కేంద్రాలు 'నో సెల్‌ఫోన్ జోన్'

టెన్త్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 32,355 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 16,760 మంది బాలురు, 15,595 మంది బాలికలు ఉన్నారు. ఇక రెగ్యులర్ విభాగంలో మొత్తం 24,125 మంది, ఒకసారి ఫెయిల్డ్ విద్యార్థులు 8,230 మంది ఉన్నారు. మొత్తం 139 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా, అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన 'సి' కేటగిరీ సెంటర్లు 39 గుర్తించారు. ఇక్కడ సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు. ఇవిగాక సమస్యాత్మక కేంద్రాలుగా ఉంగుటూరు మండలం కైకరం జడ్పీ హైస్కూలు, లింగపాలెం మండలం రంగాపురం, జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం, మండవల్లి మండలం చింతపాడు, కలిదిండి మండలం కోరుకొల్లు, గణపవరం మండలం పిప్పర ఉన్నత పాఠశాలలను గుర్తించి, ఇక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిరంతర నిఘా నిమిత్తం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు డీఈవో ఎస్.అబ్రహం వెల్లడించారు. పరీక్షా కేంద్రానికో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు మరో 24 మంది అదనపు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆరింటిని నియమించినట్టు వివరించారు. రెండేళ్ల క్రితం సెల్‌ఫోన్ల ద్వారా ప్రశ్నాపత్రం లీకేజీ, ఆరోపణలు వచ్చిన టీచర్ల అరెస్టు వంటి ఘటనలతో ఏలూరు రాష్ట్రంలోనే సంచలనం కలిగించగా ఈ దఫా అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని పరీక్షా కేంద్రాలను ' నో సెల్‌ఫోన్ జోన్ 'గా ముందుగానే ప్రకటించడంతో పాటు, ముందు జాగ్రత్తగా 144 సెక్షన్‌ను అమలులోకి తెస్తున్నారు.

ఎవరినీ ఉపేక్షించం : అబ్రహం, డీఈవో

పరీక్షా కేంద్రంలోకి చీఫ్ సూపరింటెండెంట్ సహా ఏ ఒక్కరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదు. శాఖాపరమైన అవసరాలు, సమాచారం నిమిత్తం సీఎస్ మాత్రం బేసిక్ మోడల్ ఫోన్‌ను తీసుకెళ్లి, దానిని పరీక్ష కేంద్రం పోలీసుల వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. పరీక్షల్లో ఉత్తీర్ణత/రాష్ట్రస్థాయిలో జిల్లాస్థానం కంటే ఎంత పకడ్బందీగా, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించామన్న దానికే ప్రాధాన్యత ఇస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విధులు నిర్వర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఎవరినీ ఉపేక్షించేది లేదు. విద్యార్థులు చక్కగా చదువుకుని పరీక్షలు బాగా రాయడం పైనే దృష్టి సారించాలి. పరీక్షలు ముగిసిన మరుసటిరోజు నుంచే ఈనెల 31 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతుంది. అన్ని పరీక్షా కేంద్రాల్లో వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నాం. ఎటువంటి టెన్షన్ లేకుండా విద్యార్థులు పరీక్షలు రాయొచ్చు.



సాంకేతిక లోపంతో ఆగిపోయిన బస్సు ..వేచి చూస్తున్న ప్రయాణికులు

మొరాయించిన బస్సు..ప్రయాణికులకు పాట్లు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 9 : ఆర్టీసీ ప్రగతిరథ చక్రాలు కుంటుతున్నాయి. ఏదో ఒక లోపంతో రోడ్లపై మొరాయించడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఏడాదికి ఒకసారి టిక్కెట్టు ధరలు పెంచడమే తప్ప బస్సుల బాగోగులు ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్తున్న జంగారెడ్డిగూడెం డిపో బస్సు పుట్లగట్లగూడెం వద్ద సాంకేతిక లోపంతో ఆగిపోయింది. ఎర్రటి ఎండలో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు.

రమణీయం..రథోత్సవం

కన్నుల పండువగా సోమేశ్వరస్వామి ఊరేగింపు

భీమవరం టౌన్, మార్చి 9 : మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం భక్తుల జయజయధ్వానాల మధ్య వైభవంగా సాగింది. మొక్కుగా కట్టిన అరటిపండ్ల గెలలతో, పూల అలంకారంతో సిద్ధం చేసిన రథంపై కళ్యాణమూర్తులైన సోమేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లతో క్షేత్రపాలకుడైన జనార్ధనస్వామి దంపతులు తోడుగా రథంలో ఊరేగారు. ఆలయం నుంచి బయలుదేరిన రథ బీఎన్ రోడ్డు రోడ్డు మీదుగా ముందుకు సాగింది. సాయంత్రం నాచువారి సెంటర్‌కు రథం చేరుకుంది. బాణసంచా కాల్పులు మారుమోగాయి. డీఎస్పీ నారాయణస్వామి ఆధ్వ ర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి సుబ్బారావు, ఆలయ ఈవో కృష్ణంరాజు పాల్గొన్నారు.


భీమేశ్వరస్వామి ఆలయంలో ..

భీమేశ్వరస్వామి ఆలయంలో రథో త్సవం వైభవంగా సాగింది. ప్రత్యే కంగా అలంకరించిన రథంపై మహిషాసుర మర్ధని సమేత భీమేశ్వరస్వామిని ఆశీనులు చేశారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కోటికలపూడి గోవిందరావు ప్రారం భించగా భక్తులు స్వామిరథాన్ని ముందుకు లాగారు.



క్షీరా రామలింగేశ్వర స్వామి..

పాలకొల్లు టౌన్ : పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామిని శనివారం రావణబ్రహ్మ వాహనంపై ఊరేగించారు. మేళతాళాలతో, తీన్మార్ డప్పులుతో, బుట్టబొమ్మలు, కోయడాన్సులు, కాళికామాత వేషధారణలతో భక్త జన సందోహం మధ్య క్షీరా రామలింగేశ్వరస్వామి పార్వతీ అమ్మవారి ఊరేగింపు ఉత్సవం కన్నుల పండువుగా సాగింది. పట్టణ పురవీధుల్లో శివనామ స్మరణతో స్వామివారి ఊరేగింపును నిర్వహించారు. దేవస్థానం చైర్మెన్ కోరాడ శ్రీనివాస్, ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పట్టిసీమకు రెండోరోజు భక్తుల రద్దీ

పోలవరం : మహాశివరాత్రి ఉత్సవాల రెండోరోజు పట్టిసీమకు భక్తుల తాకిడి కొనసాగింది. శనివారం సుమారు నాలుగు వేల మంది భక్తులు పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని సందర్శించినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సంగమేశ్వరశర్మ తెలిపారు. రాకపోకల కోసం నదిపై పంట్లతో వేసిన వంతెనపై రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి.

ఉత్సవాల ఆదాయం రూ.27,86,942


పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.27,86,942 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సంగమేశ్వర శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాలయ దర్శనం ద్వారా రూ.4,86,000 , శీఘ్ర దర్శనం ద్వారా రూ.3,90,700, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,62,820, కేశ ఖండనం ద్వారా రూ.1,100, హుండీల ఆదాయం రూ.12,48,252, కొబ్బరి చెక్కల ద్వారా రూ.1,17,900, తలనీలాల ద్వారా రూ.6,600, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,73,570 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.



ముగిసిన మహా సుదర్శన నృశింహయజ్ఞం

ద్వారకాతిరుమల, మార్చి9: సుందరగిరి నృశింహక్షేత్రంలో శ్రీమహాసుదర్శన నృశింహయజ్ఞం ముగిసింది. శనివారం ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తులకు జరిగిన శాంతికల్యాణం భక్తులను అలరించింది. అంతకు ముందు జరిగిన శ్రీమహాసుదర్శన యజ్ఞ క్రతువుకు ముంగింపుగా ఆదివారం తెల్లవారుజామున శ్రీమహాపూర్ణాహుతి హోమాన్ని కొచ్చర్లకోట నరసింహ గురుజీ, కుటుంబరావుల ఆధ్వర్యంలో జరిపారు. శ్రీవారి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహుని ఆలయప్రాంగణలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామికి, శివపార్వతులకు, లక్ష్మీనారాయణులకు, రుక్మిణీ సమేత పాండురంగ స్వామివారికి, ఉభయ దేవేరులతో వెంకటేశ్వరస్వామి వార్ల కల్యాణాలు వైభవంగా నిర్వహించారు.

కన్నుల పండవగా రామలింగేశ్వరస్వామి కల్యాణం





ముసునూరు, మార్చి 9: బలివే రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్స వాన్ని వేలాదిమంది భక్తుల నడుమ కన్నులపండవగా నిర్వహించారు. శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, స్వామివారిని పెండ్లి కుమా రుడిగా అలంకరణ చేసి మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శుక్రవారం రాత్రి 11.30 నిమిషాలకు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఉదయం బిందె తీర్థం, హోమం, బలిహరణ, మహాకుంభం నిర్వహించారు. రాత్రి 10 గంటల నుంచి గ్రామ పురవీధుల్లో స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈవో నల్లూరి సతీష్ కుమార్, సూపరింటెండెంట్ కె.సాయి రాము, ఆర్ఐ దీపిక, వీఆర్వోలు పర్యవేక్షించారు.



జల్లు స్నానాలు

పెదవేగి: బలివేలో రెండోరోజు భక్తుల తాకిడి కొనసాగింది. స్వామివారిని భక్తులు క్యూలైన్‌లో వేచిఉండి దర్శించుకున్నారు. పితృదేవతలకు తర్పణాలు వదిలి స్వామిని దర్శించుకున్నారు. భక్తులు స్నానాలు చేయడానికి ఇబ్బందులు పడకుండా జల్లు స్నానాల ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి కొల్లేటికోట పెద్దింటిమ్మ ఉత్సవాలు

21న జలదుర్గ- గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

ఏర్పాట్లు చేసిన అధికారులు, ధర్మకర్తల మండలి



కొల్లేరు మధ్యలో ఆలయం

కైకలూరు, మార్చి 9 : దక్షిణ కాశ్మీరంగా పేరొంది కొల్లేరు సరస్సు మధ్యలో ఉన్న కొల్లేటి కోటలో కొలువై ఉన్న పెద్దింటిమ్మ ఉత్సవాలు ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి. 21వ తేదీన జలదుర్గ అమ్మవారికి, గోకర్ణపురంలో కొలువై ఉన్న గోకర్ణేశ్వరస్వామి వార్లకు వైభవంగా కల్యాణం జరగనుంది. ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు అసోం, ఒడిశా నుంచి లక్షలాది భక్తులు తరలి వస్తారు. ఈ మేరకు ఈవో కేవీ గోపాలరావు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, కేశఖండశాల, మంచినీరు, పారిశుధ్యం, చలువ పందిర్లు, విద్యుద్దీపాలంకరణ, వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు. పదిహేను రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తాయి. అదనంగా మరో 15 రోజులు పాటు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గ్రామంలో కొలువై ఉన్న పెద్దింటిమ్మను ఇక్కడ మత్స్యకారులు తమ కులదైవంగా కొలుస్తారు. వీరంతా పూర్వం ఒడిశా ప్రాంతం నుంచి వలస వచ్చి కొల్లేరు సరస్సు చుట్టూ స్థిరనివాసం ఏర్పరచుకున్నట్టు చరిత్ర చెబుతోంది. తొమ్మిది అడుగులు ఎత్తు కలిగి విశాల నేత్రాలతో పద్మాసన భంగిమలో ఉన్న పార్వతీదేవీ ప్రతిరూపమే పెద్దింటిమ్మ.

ఇటీవల తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలు

పెద్దింటి అమ్మవారి ఆలయ ఆవరణలో ఇటీవల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా తవ్వకాలు జరిపారు. ఆ సమయంలో పూర్వకాలం నాటి విగ్రహాలు బయటపడ్డాయి. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలుగా గుర్తించారు. ఆ విగ్రహాలను ఆలయ ఆవరణలోనే ఏర్పాటు చేశారు. 2010-11 సంవత్సరాల్లో అమ్మవారి ఆలయ ముఖద్వారాన 40 అడుగుల ఎత్తున నూతన గాలిగోపురం నిర్మించారు.

ఆలయానికి ఇలా..

భక్తులు ఆలయానికి వచ్చేందుకు కైకలూరు మండలంలోని ఆలపాడుకు కైకలూరు, భీమవరం నుంచి బస్సు సౌకర్యం ఉంది. ఆలపాడు నుంచి సుమారు ఏడు కిలోమీటర్లు దూరంలో అమ్మవారి ఆలయం ఉన్నది. రహదారి మధ్యలో సర్కార్ కాల్వ వంతెన వద్ద అటవీశాఖ అధికారుల ఏర్పాటు చేసిన వాచ్‌టవర్ నుంచి చూస్తే కొల్లేరు సొయగాలు, వంతెన, కొల్లేటికోట చుట్టూ కోట ఉన్నట్టుగా డ్రోన్ కెమెరాల్లో చిత్రీకరణలో బయట పడ్డాయి. అవి ఆధ్యాత్మికంగా కనువిందు చేస్తూ ఉంటాయి. ఏలూరు జిల్లా గుండుగొలను నుంచి పెద్దింటిమ్మ ఆలయానికి చేరుకోవచ్చు. ఏలూరు నుంచి వయా చాటపర్రు-గుడివాకలంక మీదుగా ఆలయానికి చేరువచ్చు.

క్రైం కార్నర్

పట్టిసీమ ఉత్సవాలకు వెళుతుండగా ప్రమాదం

ఎదురెదురుగాబైక్‌లు ఢీ...ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

పోలవరం, మార్చి 9 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయాలపాలైన సంఘటన శుక్రవారం రాత్రి పోలవరం మండలం గూటాల పంచాయతీ మహాలక్ష్మీదేవి పేటలో జరిగింది. పోలవరం ఏఎస్సై కె.నాగేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన తోలపు దుర్గాప్రసాద్ (21) మరో ఇద్దరు స్నేహితులతో పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలకు బైక్‌పై బయల్దేరి వెళుతుండగా పట్టిసీమ నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొనడంతో దుర్గాప్రసాద్ తలకు తీవ్రగాయాలై సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందాడు. స్నేహితుడు కిరణ్ కాలికి గాయమవగా,మరో స్నేహితుడు వెంకటేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడ్డ వారిని 108 వాహనంలో రాజ మహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. దుర్గాప్రసాద్ మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

విదేశాల నుంచి తీసుకు వస్తున్న మద్యం స్వాధీనం



భీమవరంక్రైం, మార్చి 9 : దుబాయ్ నుంచి స్వదేశానికి తీసుకు వస్తున్న మద్యాన్ని ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ సత్యకిషోర్ తెలిపారు. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన అడ్డగర్ల ఉదయ్‌కిరణ్, పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన కేతా పద్మదుర్గారావులు కలిసి దుబాయ్ నుంచి స్వదేశానికి శనివారం వస్తున్నారు. లోసరి చెక్ పోస్టు వద్ద తనిఖీల్లో వారిద్దరు పట్టుబడ్డారు. వారి నుంచి విదేశీ మద్యం రూ.18,720 విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

పేకాటపై దాడి..ఇద్దరి అరెస్టు

ఆకివీడు, మార్చి 9: ఆకివీడు ఆనాల మంచినీటి చెరువు గట్టుపై శనివారం పేకాట ఆడుతున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపారు. వారి నుంచి రూ.2,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

640 కేజీల రేషన్ బియ్యం సీజ్

ఆకివీడు, మార్చి 9: రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను శనివారం రెవెన్యూ అధికారులు ఉప్పుటేరు బ్రిడ్జి దగ్గర స్వాధీనం చేసుకొన్నారు. ఆటోలో 640 కేజీలు బియ్యం ఉన్నాయి. బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్న రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు.

కుమారుడు అదృశ్యం.. తల్లి ఫిర్యాదు

ఆకివీడు, మార్చి 9:తన కుమార్డు కనబడుటలేదంటూ తల్లి పిర్యాదు మేర హెడ్ కానిస్టేబుల్ దివాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుప్పనపూడికి చెందిన నేలపల్లి పాములమ్మ కుమారుడు జ్యోతిబాబు ఈ నెల 7 నుంచి కనబడుటలేదని శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హెచ్‌సీ కేసు నమోదు చేశారు. జోతిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భర్త అదృశ్యం.. భార్య ఫిర్యాదు



పాలకోడేరు, మార్చి 9 :విస్సాకోడేరు గ్రామానికి చెందిన అంగర వెంకట్ నాగరాజు ఈనెల 5వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. పదేళ్ల క్రితం వీరిద్దరికి వివాహం కాగా ఓ పాప, బాబు కూడా ఉన్నారు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళిన వెంకట నాగరాజు కనిపించకుండా పోయాడు అంటూ భార్య ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిస్తే పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 9 : అప్పులబాధ భరించలేక ఒక వ్యాపారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తాపీమేస్త్రి కాలనీకి చెందిన కొడకా సత్యనారాయణ (50) వండ్ల వ్యాపారం చేస్తుంటాడు. కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మాట వినడం లేదని ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 9 : భార్య మాట వినడం లేదని ఒక వ్యక్తి పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు నాగేంద్రకాలనీకి చెందిన ఎస్‌కె జిలానీ (50) తన భార్య మాట వినడం లేదని బాధపడుతున్నాడు. ఆమె ఎగ్జిబిషన్‌లో పనులు అంటూ నాలుగైదు రోజులు ఊర్లు తిరుగుతూ ఉండిపోతోంది. వెళ్ళవద్దని చెబుతున్నప్పటికీ ఆమె మాట వినకపోవడంతో మనస్థాపానికి గురైన జిలానీ ఈనెల 7వ తేదీ సాయంత్రం పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతతకు గురవడంతో కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రథోత్సవంలో భక్తజనం

నంది వాహనంపై గ్రామోత్సవం



శివదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు క్షేత్రపాలకుని ఆలయంలో ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం వేదపారాయణలు, శివదేవునికి ప్రత్యేక అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. రాత్రి గంగాపార్వతీ సమేత శివదేవుని ఉత్సవ మూర్తులను అలంకరించిన నందివాహనంపై ఉంచి పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాల నడుమ స్వామివారిని ఊరేగించారు.



బలుసులమ్మ ఆలయంలో శ్రీవారి నిత్య సేవలు

తాడేపల్లిగూడెం రూరల్ : దేవదాయ ధర్మ దాయశాఖ, ధార్మిక పరిషత్ ధర్మ ప్రచార మహోత్సవంలో భాగంగా తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయం వద్ద శనివారం టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి నిత్యసేవలు నిర్వహించారు. టీటీడీ నుంచి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలను రప్పించి ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు సేవలు నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి పర్యవేక్షించగా మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబీకులు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ రాజు సీజీఎఫ్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



వీక్షిస్తున్న భక్తజనం



మావుళ్ళమ్మను దర్శించుకున్న చిరంజీవి సతీమణి, కుమార్తెలు

భీమవరం టౌన్,మార్చి 9 : భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారిని చిరంజీవి సతీమణి, కుమార్తెలు దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. వీరికి ఆలయ ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు. ధర్మకర్తల మండలి సభ్యులు ముత్యాల రామారావు తదితరులు ఉన్నారు.

మర్లగూడెం అడవిలో మంటలు



బుట్టాయగూడెం, మార్చి 9 :మర్లగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం పెద్ద ఎత్తున మంటలు రెలరేగడంతో చాలావరకు అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. జామాయిల్ చెట్లు కూడా మంటల్లో తగలబడి పోయాయి. ఆకతాయిల కారణంగా మంటలు చెలరేగాయా వేసవి ఎండలను తలపిస్తున్న ప్రస్తుత ఎండలకు ఆకులు రాలడం వలన రాపిడికి మంటలు చెలరేగాయా అన్న విషయం తెలియాల్సి ఉంది.

నెలమూరులో పేకాటపై దాడి

26.89 లక్షల నగదు స్వాధీనం.. 20 మంది అరెస్టు

పెనుమంట్ర, మార్చి 9 : పెనుమంట్ర మండలం నెలమూరు శివారు రొయ్యల చెరువుల సమీపంలో ఉన్న గెస్ట్‌హౌస్‌పై ప్రత్యేక నిఘా పోలీసులు దాడి చేశారు. 20 మందిని అరెస్టు చేసి వారి నుంచి 26 లక్షల 89 వేల రూపాయలు స్వాధీన పరుచుకున్నట్లు పెనుమంట్ర ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. అధికార పార్టీ నాయకులు గుట్టుచప్పుడు పేకాట స్థావరం సాగిస్తున్నారని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా పోలీసులు దాడులు చేశారు. 26 మందిని అదుపులోకి తీసుకోగా అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు ఆరుగురిని కేసు నుంచి తప్పించారని తెలుస్తున్నది. గుట్టుచప్పుడు కాకుండా పేకాట స్థావరం నిర్వహిస్తున్న వ్యక్తి పోడూరు మండలం ప్రజా ప్రతినిధి కావడంతో పాటు అధికార పార్టీకి చెందిన మరికొందరు ప్రముఖులు ఉండటంతో వారిని కేసు నుంచి తొలగించారని సమాచారం. సంఘటనా స్థలంలో పెద్ద ఎత్తున సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తున్నది.


ప్రత్తికోళ్లలంకలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రత్తికోళ్లలంకలో సాయుధ దళాల కవాతు

ఏలూరు క్రైం, మార్చి 9 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి ఆత్మస్థైర్యం కల్పించే నిమిత్తం సాయుధ బలగాలు కవాతు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ కె. రాజారెడ్డి తన సిబ్బందితోపాటు సాయుధ దళాలు కలిసి సమస్యాత్మక ప్రాంతాలైన ప్రత్తికోళ్లలంక, గుడివాకలంక ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ కవాత్ నిర్వహించారు. రూరల్ ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా శ్రీగంగానమ్మ ఆలయ వార్షికోత్సవం


చింతమనేనిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

పెదవేగి, మార్చి 9 : పెదకడిమిలో గంగానమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పూజలు జరిపారు. గ్రామ సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణచౌదరి, ఎంపీటీసీ సభ్యుడు చల్లగొళ్ళ గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు మాదల కోదండరాంబాబు, కొసరాజు సూరిబాబు, రామ్మోహనరావు, చల్లగొళ్ళ లక్ష్మణరావు, బాబీ, రాము, పర్వతనేని సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మేధా దక్షిణమూర్తికి చింతమనేని పూజలు

దెందులూరు,మార్చి 9 :చిన్నకాశీగా పేరు పొందిన చల్లచింతలపూడి గ్రామంలోని మేధా దక్షిణమూర్తి స్వామిని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాధమ్మ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వేమన రాముగౌడ్, ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, శ్రీమన్నారాయణ, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నేతలు రొక్కం మాధవరావు, మోదుగుమూడి రాంబాబు, నాగనబోయిన సత్యనారాయణ ఉన్నారు. మేధా దక్షిణామూర్తిని తపన సంస్థల అధినేత గారపాటి చౌదరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

'కేజీబీవీ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్/కుక్కునూరు, మార్చి 9 : జిల్లాలోని కుక్కునూరు, వేలేరు, వేలేరుపాడుల్లో నిర్వహిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీలలో ఒక్కో గ్రూపునకు 40 సీట్ల చొప్పున ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ బి.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు ఈ పాఠశాలల్లో 7, 8, 9 తరగతుల్లో మిగిలివున్న సీట్లను భర్తీ చేస్తారు. కుక్కునూరు కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, 8వ తరగతిలో ఒకటి, 9వ తరగతిలో ఒకటి, ఫస్ట్ ఇయర్ ఇంటర్ బైపీసీలో 40, వేలేరు కేజీబీవీలో 6 తరగతిలో 40, 8వ తరగతిలో 2, పదో తరగతిలో 2, ఫస్ట్ ఇయర్ ఇంటర్ ఎంపీసీలో 40 ఖాళీలు ఉన్నాయి. అనాథలు, బడి బయట చిన్నారులు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువనవున్న కుటుంబాల బాలికలు మాత్రమే అడ్మిషన్లకు అర్హులు. కుటుంబ ఆదాయ పరిమితి పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు ఉన్నవారు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీలోగా ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన వారి ఫోన్ నంబర్లకు మెసేజ్ రూపంలో సమాచారం అందిస్తారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 1800 4258599లో సంప్రదించాలి.

ఇంటర్ పరీక్షలకు 762 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 9 : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ప్రథమ సంవత్సరం గణితం, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో 12,519 మంది, ఒకేషనల్ విభాగంలో 2,005 మంది విద్యార్థులు హాజరు కాగా మొత్తం 762 మంది గైర్హాజరైనట్టు వివరించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

14న 'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

చింతలపూడి, మార్చి 9 : సంయుక్త కిసాన్ మోర్చ పిలుపులో భాగంగా ఈనెల 14వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని పోతునూరు గ్రామంలో శనివారం జరిగిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దతు ధరలకు చట్టబద్ధత చేస్తామని, వ్యవసాయచట్టాలను రద్దు చేస్తామని, లిఖితపూర్వకంగా రైతు ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 14న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.కాలేషా, రావెళ్ళ రాజా పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘాల ప్రమాణ స్వీకారం

చింతలపూడి, మార్చి 9 : స్థానిక వీకేఎం ఫంక్షన్ హాలులో మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘాల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరుగుతుందని పట్టణ శాఖ అధ్యక్షుడు వజ్రపు శేఖర్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి వరకు మహిళా దినోత్సవం పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మండలంలోని ఆర్యవైశ్య మహిళలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు రూరల్, మార్చి 9: ఏలూరు లయన్స్ క్లబ్, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి సత్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సత్రం ప్రాంగణంలో వంగాయగూడెం, గుడ్ సమరిటిన్, క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో జనరల్, ఎముకలు, కీళ్ళు, కిడ్నీ, మూత్ర, క్యాన్సర్ వ్యాధులకు ఉచిత వైద్యం అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంపు చైర్మన్ వేమా రామచంద్రరావు, జి.రామ్మోహన్‌రావు, టి.వి.ఎస్.ఎస్ నారాయణరావు, కంది బాలకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు కందియం ప్రసాద్, ఎం.చలపతిరావు, గుర్రం సత్యనారాయణ, కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

మంచి ఆహారం, నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు రూరల్, మార్చి 9: మంచి ఆహారం, నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీకృష్ణ ఆసుపత్రి డాక్టర్ బి.కృష్ణ పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం ఉచిత ఆర్థో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉచిత వైద్యసేవలతో పాటు రక్త, ఎముకల సాంద్రత, స్కానింగ్, ఎక్స్‌రే సేవలు ఉచితంగా అందజేశారు. వంద మందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్వో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వింత ఆవుదూడ జననం


కొవ్వాడలో జన్మించిన వింత ఆవుదూడ

బుట్టాయగూడెం, మార్చి 9 : రెండు తలలు, ఆరుకాళ్లతో వింత ఆవుదూడ జన్మించిన ఘటన శనివారం కొవ్వాడ గ్రామంలో జరిగింది. ఇటీవల గ్రామానికి చెందిన కుంజా కొవ్వాడయ్య ఆవును చంపి తిన్న ఘటన తెలిసిందే. అతడికి చెందిన ఆవు శనివారం సాయంత్రం వింత ఆవుదూడకు జన్మనిచ్చింది. దీనిని చూసేందుకు గ్రామస్థులు ఎగబడ్డారు. వింతదూడ పుట్టిన కొద్దిసేపటికి చనిపోయినట్లు తెలిపారు.


చింతలపూడి వెలమపేటలో రోషన్‌కు హారతి ఇస్తున్న మహిళలు, ఏలూరులో మినీ మేనిఫెస్టో వివరిస్తున్న టీడీపీ నేత బడేటి చంటి

మహిళలు, బీసీలే టీడీపీకి బలం

చింతలపూడి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి రోషన్‌కుమార్

చింతలపూడి, మార్చి 9 :మహిళలు, బీసీలే తెలుగుదేశం పార్టీకి బలమని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థిగా తనను గెలిపించాలని సొంగా రోషన్‌కుమార్ కోరారు. చింతలపూడి పట్టణంలో శనివారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి వెలమపేట, సమ్మెటవారిగూడెం, పాతచింతలపూడి, వెలమపేట కాలనీలలో ఇంటింటా ప్రచారం చేసి సూపర్-6 పథకాలను వివరించారు. వెలమపేటలో మహిళలు హారతులు పట్టి ఆ పేటలోని సమస్యలను ఏకరువుపెట్టారు. అక్కడి నుంచి పాత చింతలపూడిలో బోడా నాగభూషణం, బోడా అనీష్‌కుమార్ ఆధ్వర్యంలో భారీగా పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత చింతలపూడిలో సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, మన్యం సత్తిబాబు, పక్కాల వెంకటేశ్వరరావు, రాజారత్నం, టి.అప్పారావు, కొత్తపూడి శేషగిరి, కొడాలి శివనాగేశ్వరరావు, సుందరమ్మ, జనసేన నాయకులు టి.ఎస్.వి.కుమార్, మలిశెట్టి శ్రీనివాసరావు, చీదరాల మధుబాబు, రాఘవేంద్రరావు, నాగరాజు, శివ, భారతి పాల్గొన్నారు.

ప్రగడవరంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం


వెల్లమిల్లి జనసేన కార్యక్రమంలో పత్సమట్ల ధర్మరాజు

ప్రగడవరం గ్రామంలో సొంగా రోషన్‌కుమార్‌కు టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. తాళ్ళూరి చంద్రశేఖరరెడ్డి, కె.రాజశేఖరరెడ్డి, బీసీ నాయకులు కొప్పెర్ల నాగరాజు, మారేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ చీకటి పాలనకు స్వస్తి : బడేటి చంటి

ఏలూరుటూటౌన్, మార్చి 9 : రాష్ట్రంలో నెలకొన్న వైసీపీ చీకటిపాలనకు స్వస్తి పలికేందుకు నడుంబిగించాలని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి పిలుపునిచ్చారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 20వ డివిజన్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో జగన్, రాక్షస పాలన మళ్లీ రాకూడదన్న దృఢనిశ్చయంతో ప్రజలున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. నియంతపాలనకు చరమగీతం పాడేందుకు ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కప్పా ఉమామహేశ్వరరావు, అమరావతి అశోక్, రెడ్డి నాగరాజు, చవ్వా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం : పత్సమట్ల

ఉంగుటూరు, మార్చి 9 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన విషయంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు విమర్శించారు. శనివారం సాయంత్రం మండలంలోని వెల్లమిల్లి, చింతాయిగూడెం గ్రామాల్లో పర్యటించి జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజలు గ్రామంలో డ్రెయినేజీ సమస్యపై ఏకరువు పెట్టారు. దోమల బెడదతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్న విషయమై ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.రాంబాబు, పగడాల ప్రసాద్, గుండాబత్తుల బాలాజీ, సాయి, కేశవ, టీడీపీ నాయకులు పులపాక శ్రీను, బండి స్వరూప్, చెన్నా మారయ్య, జన సైనికులు పాల్గొన్నారు.

దోమల నివారణకు పరిసరాలు శుభ్రంగా ఉంచాలి


దోమల మందు స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు, మార్చి 9 : దోమల నివారణకు వీధులు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉపఅధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలోని దొంతవరం, పొట్టిపాడు గ్రామాల్లో సర్వే, సెక్టార్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించారు. ప్రతివారం డ్రైడే నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన నిమిత్తం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి కమతపు శ్రీనివాసరావు, గ్రామ ఆరోగ్య పర్యవేక్షకులు విజయ, సత్యనారాయణ, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సర్పంచ్‌ల సంఘం చేయూత

బుట్టాయగూడెం, మార్చి 9 : మంచులవారిగూడెంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన కేరం వెంకటేశ్వరావు, బుజ్జమ్మ దంపతులకు బుట్టాయగూడెం మండల సర్పంచ్‌ల సంఘం చేయూతనిచ్చారు. శనివారం 25 కేజీల బియ్యం, దుప్పట్లు, నూనె, కూరగాయలు, రెండు వేల రూపాయల నగదు అందజేశారు. పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు చింతలపూడిలో జనసేన సమావేశం

చింతలపూడి, మార్చి 9 :చింతలపూడిలోని షాదీఖానాలో జనసేన నియోజకవర్గ సమావేశం ఆదివారం జరుగుతుందని ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్‌తో పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య తెలిపారు. టీడీపీ-జనసేన నాయకులు పాల్గొంటారని, నాలుగు మండలాల్లోని జనసేన కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.


పెదవేగిలో శివపార్వతుల కల్యాణం, టి.నరసాపురంలో స్వామివారి రథోత్సవం, కుక్కునూరు శివాలయంలో అన్నదానం

కమనీయం శివపార్వతి కల్యాణం

- ఆలయాల్లో అన్నసమారాధనలు
- రథోత్సవాలు.. ఆకట్టుకున్న కోలాటం

పెదవేగి, మార్చి 9 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పెదవేగి శివాలయంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. అర్చకుడు తిప్పాభట్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్చరణ మధ్య ఆది దంపతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయ ఆవరణలో చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. పెదవేగి ఎంపీపీ తాతారమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : కుక్కునూరు శివాలయంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. వందలాది భక్తులు కల్యాణం తిలకించారు. సుమారు 1500 మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తిపాటలతో కోలాటం నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు :మండలంలోని పలు గ్రామాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు శనివారం తెల్లవారుజాముతో ముగిశాయి. శుక్రవా రం రాత్రి కైకరం తదితర గ్రామాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన అనంతరం తెల్లవారు జామున స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆదివారం ఆలయం సన్నిధిలో అన్నసమారాధన ఉంటుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

● టి.నరసాపురం : టి.నరసాపురంలో అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించామని ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవారిని శనివారం ఉదయం రథంపై ఊరేగించారు. శివ భక్తులు పర్వతనేని మురళి, పసుమర్తి రాము మాట్లాడుతూ గత 27 ఏళ్లుగా దాతల సాయంతో శివరాత్రి ఉత్సవాలు, భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మల్లుకుంటలో భువనేశ్వరి సమేత ఉమామహేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో నిర్వహించిన అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలలో గాది రాజేంద్రప్రసాద్‌రెడ్డి, తుమ్మూరి మాధవీలత, నల్లూరి శ్రీనివాస్, లింగారెడ్డి శ్రీను, నూతి రాంబాబు, పెద్దిన ఫణి, అద్దంకి మహేశ్వరరావు, జగ్గారావు, వెజ్జు బాలరాజు, అన్నపరెడ్డి మురళి, పులగం వసంతరెడ్డి, జి.సత్యనారాయణ, సోర్ల సుబ్బారావు, టి.ప్రసాద్‌రెడ్డి, ఎం.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

'సమాజంలో మహిళల పాత్ర కీలకం'



యర్రగుంటపల్లిలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి లక్ష్మి
తువ్వచిలుకరాయుడుపాలెంలో ఉపాధ్యాయినులకు సన్మానం

చింతలపూడి, మార్చి 9 :సమాజంలో మహిళల పాత్ర కీలకమని, మహిళా సాధికారిత సాధనతోనే దేశాభివృద్ధి జరుగుతుందని రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి అన్నారు. యర్రగుంటపల్లి గ్రామంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాలు గణనీయమైన పురోగతి సాధించాయని, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మాత్రం సాధించాల్సిన సవాళ్ళు చాలా ఉన్నాయని అన్నారు. మరో అతిథి, మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మహిళల అణచివేతను ప్రతిఘటిస్తూ చేసిన ఉద్యమ పోరాటాల ఫలితంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమానికి రిటైర్డ్ పీడీ నాగమణి అధ్యక్షత వహించగా, గైనకాలజి డాక్టర్ ఆర్.భవ్య, ఆర్థోపెడిక్ డాక్టర్ జి.దీప్తి, సీడీపీవో పి.మాధవి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.యామిని, జిల్లా అధ్యక్షురాలు శ్యామల తదితరులు ప్రసంగించారు. తొలుత మహిళా సమాఖ్య జెండాను ఎగురవేశారు. మానవత అధ్యక్షుడు పి.సోమశేఖర్, డాక్టర్ ఎ.సత్యనారాయణ, అప్పారావు తదితరులు సహకరించారు.

తువ్వచిలుక రాయుడుపాలెంలో..

లింగపాలెం, మార్చి 9: తువ్వచిలుక రాయుడుపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం కె.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ మహిళల ఔన్నత్యాన్ని వివరించారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా విభిన్న పాత్రలు పోషిస్తున్న మహిళలందరికి ప్రపంచం ఎప్పుడు రుణపడి ఉంటుందన్నారు. మహిళామూర్తుల గొప్పతనాన్ని స్త్రీవిద్య ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం మహిళా టీచర్లను సన్మానించారు. ఉపాధ్యాయినులు బి.రజిని, పి.లత, డి.భవాని, ఝాన్సీరాణి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 9 :స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కేవీ రమణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి ఒకటి నుంచి 15 వరకు నిర్వహిస్తున్నందున శనివారం జంగారెడ్డిగూడెం ముత్తరాసిపేటలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అనేక ఏళ్లుగా మహిళలకు పురుషులతో సమానత్వం లేదని ఇంటి పని బయటపని మహిళలే చేసి దోపిడీ గురవుతున్నారని అన్నారు. దేశంలో మహిళలు, బాలికలపై వేధింపులు, పని ప్రదేశాలలో వేధింపులు, అత్యాచారాలు, హత్యలు మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాసు బోయిన సాయమ్మ, అక్కుల అన్నపూర్ణ, రొయ్యల సితామహాలక్ష్మి, రొయ్యల నాగమణి, అల్లే లక్ష్మి, బహు రోజు దుర్గవేణి, నాగ దుర్గ, రొయ్యల రమాదేవి, వాసు బోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత పాలి ప్రసాద్ మృతికి సంతాపం

పెదవేగి, మార్చి 9 : టీడీపీ సీనియర్ నేత, టీడీపీ జిల్లా కార్యాలయం కార్యదర్శి పాలి ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. గత నెల 28వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి బహిరంగ సభలో ప్రమాదానికి గురై గాయపడ్డారు. అప్పటినుంచి ఏలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

'పోలీసులు నోటీసులివ్వడం దుర్మార్గం'

ఏలూరుటూటౌన్, మార్చి9 :ప్రస్తుతం ఎటువంటి ఆందోళనలు నిర్వహించనప్పటికీ పోలీసులు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్‌రోకోలు, రైల్వేస్టేషన్ల ముందు నిరసన తెలిపేందుకు అనుమతి లేదని, నిరసన చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్‌కు టూటౌన్ పోలీసులు శనివారం నోటీసులు ఇచ్చారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు, కౌలురైతులు ఎటువంటి ఆందోళన చేపట్టకపోయినప్పటికి ముందస్తుగా నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు.

పేదలకు ఆపన్న హస్తం 'ఇందిరమ్మ అభయహస్తం'

పెదవేగి, మార్చి 9:కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల అభ్యున్నతికి అనుగుణంగా ఇందిరమ్మ అభయహస్తం పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ దెందులూరు నియోజకవర్గం సమన్వయకర్త అలపా టి నరసింహమూర్తి అన్నారు. ముండూరులో శనివారం రాత్రి ఇందిరమ్మ అభయహస్తం పథకం పోస్టర్‌ను ఆయన ఆవిష్క రించారు.

రేపు రైతు సదస్సు జయప్రదం చేయండి

టి.నరసాపురం, మార్చి 9 : విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 11వ తేదీన జరిగే రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మర్రిగూడెం గ్రామంలో రైతు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండలం నుంచి అధికసంఖ్యలో రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఆర్‌సీఎస్ డివిజన్ నాయకులు కొండబత్తుల బాబూరావు, కె.నవీన్, కె.సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు ఏకమై రాజ్యాధికారం సాధించాలి

ఏలూరుటూటౌన్, మార్చి9: రాబోయే ఎన్నికల్లో దళిత బహుజనులంతా ఏకమై బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా పోరాడాలని దళిత బహుజన నాయకులు మెండెం సంతోష్‌కుమార్, దేవరకొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఫ్లాష్‌టీమ్ కార్యాలయంలో దళిత బహుజనుల ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. నేతల రమేష్‌బాబు మాట్లాడుతూ మనువాద పార్టీలు అధికారంలోకి రాకుండా దళిత బహుజనులంతా ఏకం కావాలన్నారు. సిర్రా భరత్, ఎం.ఇస్సాకు, మతే బాబి, ఎం.సత్యనారాయణ, పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

ఏలూరు రూరల్, మార్చి 9: చాటపర్రు, మొండికోడు గ్రామాల్లో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. చాటపర్రు ఒకటో వార్డు పరిధిలో సీసీరోడ్డును ప్రారంభించారు. మొండికోడులో పైప్‌లైన్‌ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, సీసీ రోడ్లను, షెడ్డును ప్రారంభించారు. గ్రామంలో నాలుగోవిడత వైఎస్సార్ చేయూత చెక్కును అందజేశారు.

అలరించిన నృత్యప్రదర్శనలు



ఏలూరు కల్చరల్, మార్చి 9: స్థానిక రామకోటి ప్రాంగణంలో రామకోటి ఉత్సవాల సందర్భంగా త్రికాయ డ్యాన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్రికాయ నృత్యప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. సంస్కృతి, పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పరంపర సంస్థ నృత్యపోటీలను శనివారం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రాకేష్, క్రియాశ్రీనివాసన్ గ్రూపులు చేసిన నాట్యం సమ్మోహితులను చేసింది. సంస్కృతిని ప్రజల వద్దకు తీసుకువచ్చేందుకు పరంపర కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మాధవరావుకు 'గన్ని' నివాళి


మాధవరావుకు నివాళులర్పిస్తున్న గన్ని

భీమడోలు/ఉంగుటూరు మార్చి 9 : టీడీపీ సీనియర్ నేత, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు వగ్వాల మాధవరావు మృతికి ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు నివాళులర్పించారు. గుండుగొలనుకు చెందిన మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా సేవలందించిన ఆయన శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా గన్ని ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నేతలు సిరిబత్తిన కొండబాబు, ఇందుకూరి రామకృష్ణంరాజు, పుల్లయ్యనాయుడు, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వగ్వాల మృతికి మాజీ ఎమ్మెల్యే కొండ్రెడ్డి సంతాపం

భీమడోలు మండల ప్రజా పరిషత్తు తొలి అధ్యక్షుడిగా ఎన్నికైన వగ్వాల మాధవరావు నీతి నిజాయతీ గల వ్యక్తి అని మాజీ ఎమ్మెల్యే కొండ్రెడ్డి విశ్వనాథం పేర్కొన్నారు. నల్లజర్ల మండల ప్రజా పరిషత్తు మాజీ అధ్యక్షుడు మల్లెపూడి బాబూరావు సంతాపం తెలిపారు.

'పర్స సత్యనారాయణ జీవితం ఆదర్శం'


కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు,తదితరులు

ఏలూరుటూటౌన్, మార్చి9: కార్మిక వర్గానికి పర్స సత్యనారాయణ జీవితం ఆదర్శమని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. సీతారామ భక్తియా కల్యాణ మండపంలో సత్యనారాయణ శతజయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు ఆచరించి కార్మికహక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన మహామనిషి సత్యనారాయణ అని కొనియాడారు. సీఐటీయూ వ్యవస్థాపకునిగా కార్మికులకు ఎన్నో సేవలు అందించారని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్, డీఎన్‌వీడీ ప్రసాద్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి'


రవ్వన్న చిత్రపటం వద్ద రాఘవ నివాళి

బుట్టాయగూడెం, మార్చి 9 : పాలకపక్షాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కారం రాఘవ అన్నారు. రాయల సుభాష్ చంద్రబోస్ (రవ్వన్న) ఎనిమిదో వర్ధంతి సందర్భంగా లంకపాకలలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చిం తల మహేష్ అధ్యక్షతన జరిగిన సభ లో రాఘవ మాట్లాడారు. సర్పంచ్ కారం లక్ష్మి, కరకాల వెంకటేష్, చెల్లమ్మ, చిన్నారెడ్డి కొండరెడ్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం

బుట్టాయగూడెం, మార్చి 9 : గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించి పనులు పూర్తిచేస్తున్నట్టు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శనివారం రెడ్డిగణపవరంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ గొడౌన్, పాలశీతలీకరణ కేంద్రంను నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మొడియం రామతులసి, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపీపీ గుగ్గులోతు మోహనరావు, సర్పంచ్ తెల్లం జయమ్మ, ఎంపీటీసీ అల్లూరి రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



బలివేలో కల్యాణమూర్తులు..







అల్లూరు సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు



పెదలంకలో రథోత్సవం (ఇన్‌సెట్) ఉత్సవమూర్తులు

కన్నుల పండువగా కల్యాణం

» బలివే రామేశ్వరస్వామికి తగ్గని భక్తుల తాకిడి » పలు ప్రాంతాల్లో వైభవంగా ఊరేగింపు

ముసునూరు, మార్చి 9: బలివే రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేలాది మంది భక్తుల నడుమ కన్నుల పండవగా నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకువచ్చి శుక్రవారం రాత్రి 11.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య తొమ్మిది మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం తాతగుడికి ఊరేగింపుగా వెళ్ళి స్వామివారు ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో మూడో రోజు శనివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. స్వామి వారిని భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండి దర్శించుకున్నారు. రాత్రి 10 గంటల నుంచి గ్రామపురవీధుల్లో స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ పి.వాసు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ కె.సాయిరాము, ఆర్‌ఐ దీపిక, వీఆర్వోలు పర్యవేక్షించారు. కాగా ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారని, ఆ మేరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చాట్రాయి: మహాశివరాత్రి సందర్భంగా చాట్రాయి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించగా కల్యాణమూర్తులను మంగళవాయిద్యాలతో శనివారం గ్రామంలో కన్నుల పండువగా ఊరేగించారు. అన్ని గృహాల వద్ద స్వామివారికి భక్తులు పూజలు చేశారు. పోలవరంలో శివపార్వతులను గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కనసానపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా బాల త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు అన్నదానం, సాయంత్రం 7 గంటలకు గ్రామోత్సవం జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో హాజరైనట్టు అర్చకులు సాయిస్వరూప్ తెలిపారు.

పెదలంకలో వైభవంగా రథోత్సవం

కలిదిండి: శివరాత్రి మహోత్సవాల సందర్భంగా పెదలంకలో పార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. వసంతోత్సవం, త్రిశూల స్నానం నిర్వహించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ అయినాల బ్రహ్మాజీరావు, ఆలయ ఛైర్మన్ అయినాల సత్యనారాయణ, అర్చక స్వామి మామిళ్ల నాగేంద్రరావు, ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మహాశివరాత్రి సందర్భంగా ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అల్లూరులోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి అనంతరం లింగోద్భవ సమయంలో అర్చకులు అయిలూరి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించి జాగరణ చేశారు.



ఘనంగా మహిళా దినోత్సవం

ఆగిరిపల్లి, మార్చి 9: ఆగిరిపల్లి మండలం రాజవరం గ్రామంలో స్ఫూర్తి మహిళా సహకార పరపతి సంఘంలో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమాజంలో స్త్రీ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి స్త్రీ తనలోని నైపుణ్యాన్ని బయటకు తేవాలని ఆగిరిపల్లి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ టీచర్ మోచర్ల సత్యశ్రీ సూచించగా మహిళలు హక్కుల కోసం పోరాడాలని తోటపల్లి ఎంపీ యూపీ స్కూల్ హెచ్‌ఎం ఎస్‌వీ లక్ష్మి అన్నారు. పరపతి సంఘం ఇన్‌చార్జ్ సిస్టర్ ఇందిర మాట్లాడుతూ మహిళలు సొంతంగా నిర్ణయం తీసుకునే స్థాయికి ఎదగాలన్నారు. ప్రెసిడెంట్ భూషణం, మహిళలు పాల్గొన్నారు.

బలివే ఆలయానికి కెనరా బ్యాంక్ వితరణ



ముసునూరు, మార్చి 9: బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి వేల్పుచర్ల కెనరా బ్యాంక్ యాజమాన్యం కలర్ ప్రింటర్ కొనుగోలు నిమిత్తం శనివారం చెక్కును అందజేశారు. బ్యాంక్ మేనేజర్ ఎం.రాజ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎం.మురళీకృష్ణారావు కలర్ ప్రింటర్‌కు సంబంధించి రూ. 18,500లు చెక్కును ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఈవో సన్మానించారు. ఆలయ ఛైర్మన్ నాగుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు వరం.. సుకన్య పథకం



అకౌంట్ బుక్స్‌తో చిన్నారులు, దాతలు

ముసునూరు, మార్చి 9: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు వరమని పోస్టు మాస్టర్ కానూరి భాస్కరరావు అన్నారు. ముసు నూరులో సుకన్య పథకం ఖాతాలు తెరవని 20 మంది ఆడపిల్లలకు దాతలు పాకనాటి సీతారామ్, మానికల గంగధరరావులు రూ. 5 వేలతో శనివారం అకౌంట్స్‌ను ఓపెన్ చేయించారు. పదేళ్ల లోపున్న ప్రతి ఆడపిల్లకు సుకన్య పథకంపై పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేయించాలని, ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను దాతలు వివరించారు.

సూర్య ఘర్ పథకం ఆన్‌లైన్



చాట్రాయి, మార్చి 9: మండలంలోని చాట్రాయి, చనుబండ తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్ళి ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన (సోలార్ విద్యుత్) పథకం ప్రయోజనాలను వివరించి, లబ్ధిదారులను పోస్టాఫీలకు తీసుకువచ్చి ఆన్‌లైన్ చేయించారు. బీజేపీ, జనసేన నాయకులు ముత్తారెడ్డి, బుర్రి శ్రీకర్, నెక్కలపు వెంకటేశ్వరరావు, గోపీ, శర్మ, జగన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మావుళ్ళమ్మను దర్శించుకున్న చిరంజీవి సతీమణి, కుమార్తెలు

భీమవరం టౌన్,మార్చి 9 : భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారిని చిరంజీవి సతీమణి, కుమార్తెలు దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. వీరికి ఆలయ ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు. ధర్మకర్తల మండలి సభ్యులు ముత్యాల రామారావు ఉన్నారు.

క్రైం కార్నర్

మహిళ మెడలో గొలుసు చోరీ

కైకలూరు, మార్చి 9: కైకలూరులో చైన్ స్నాచింగ్‌పై కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఏలూరులో రెవెన్యూ ఉద్యోగిగా పనిచేస్తున్న కైకలూరుకు చెందిన గోళ్ళ జగదాంబ ఆర్టీసీ బస్టాండులో దిగి చిన్నమసీదు మీదుగా ఎన్జీవోస్ కాలనీలోకి నడిచి వెళుతుండగా ఆగంతుకుడు వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని 3 కాసులు బంగారు గొలుసును తెంపుకుని పారిపోయాడు. కొద్దిసేపు ఆమె పెనుగులాడినా ఫలితం లేకపోయింది. ఆమె కేకలు వేయడంతో ఆగంతుకుడు పరిగెత్తుకుంటూ వెళ్లి సమీపాన బైక్‌తో సిద్ధంగా ఉన్న మరో యువకుడితో కలసి ఉడాయించాడు. బాధితురాలు కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం.. ఇద్దరి అరెస్ట్

నూజివీడు టౌన్, మార్చి 9: నూజివీడు సెబ్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో సారా తయారీకి 9 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి పోలవరం గ్రామానికి చెందిన వెలివెల్లి తరుణ్, బిలుగూడి జీవన్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు పజ్జూరి బాలకృష్ణ పరారీలో ఉన్నట్లు తెలిపారు.


రేపటి నుంచి కొల్లేటికోట పెద్దింటమ్మ ఉత్సవాలు

21న జలదుర్గ- గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

ఏర్పాట్లు చేసిన అధికారులు, ధర్మకర్తల మండలి



కొల్లేరు మధ్యలో ఆలయం



కైకలూరు, మార్చి 9 : దక్షిణ కాశ్మీరంగా పేరొంది కొల్లేరు సరస్సు మధ్యలో ఉన్న కొల్లేటి కోటలో కొలువై ఉన్న పెద్దింటిమ్మ ఉత్సవాలు ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి. 21వ తేదీన జలదుర్గ అమ్మవారికి, గోకర్ణపురంలో కొలువై ఉన్న గోకర్ణేశ్వరస్వామి వార్లకు వైభవంగా కల్యాణం జరగనుంది. ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు అసోం, ఒడిశా నుంచి లక్షలాది భక్తులు తరలి వస్తారు. ఈ మేరకు ఈవో కేవీ గోపాలరావు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, కేశఖండశాల, మంచినీరు, పారిశుధ్యం, చలువ పందిర్లు, విద్యుద్దీపాలంకరణ, వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు. పదిహేను రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తాయి. అదనంగా మరో 15 రోజులు పాటు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గ్రామంలో కొలువై ఉన్న పెద్దింటిమ్మను ఇక్కడ మత్స్యకారులు తమ కులదైవంగా కొలుస్తారు. వీరంతా పూర్వం ఒడిశా ప్రాంతం నుంచి వలస వచ్చి కొల్లేరు సరస్సు చుట్టూ స్థిరనివాసం ఏర్పరచుకున్నట్టు చరిత్ర చెబుతోంది. తొమ్మిది అడుగులు ఎత్తు కలిగి విశాల నేత్రాలతో పద్మాసన భంగిమలో ఉన్న పార్వతీదేవీ ప్రతిరూపమే పెద్దింటిమ్మ.

ఇటీవల తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలు

పెద్దింటి అమ్మవారి ఆలయ ఆవరణలో ఇటీవల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా తవ్వకాలు జరిపారు. ఆ సమయంలో పూర్వకాలం నాటి విగ్రహాలు బయటపడ్డాయి. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలుగా గుర్తించారు. ఆ విగ్రహాలను ఆలయ ఆవరణలోనే ఏర్పాటు చేశారు. 2010-11 సంవత్సరాల్లో అమ్మవారి ఆలయ ముఖద్వారాన 40 అడుగుల ఎత్తున నూతన గాలిగోపురం నిర్మించారు.

ఆలయానికి ఇలా..



పెద్దింటమ్మ

భక్తులు ఆలయానికి వచ్చేందుకు కైకలూరు మండలంలోని ఆలపాడుకు కైకలూరు, భీమవరం నుంచి బస్సు సౌకర్యం ఉంది. ఆలపాడు నుంచి సుమారు ఏడు కిలోమీటర్లు దూరంలో అమ్మవారి ఆలయం ఉన్నది. రహదారి మధ్యలో సర్కార్ కాల్వ వంతెన వద్ద అటవీశాఖ అధికారుల ఏర్పాటు చేసిన వాచ్‌టవర్ నుంచి చూస్తే కొల్లేరు సొయగాలు, వంతెన, కొల్లేటికోట చుట్టూ కోట ఉన్నట్లుగా డ్రోన్ కెమెరాల్లో చిత్రీకరణలో బయటపడ్డాయి. అవి ఆధ్యాత్మికంగా కనువిందు చేస్తూ ఉంటాయి. ఏలూరు జిల్లా గుండుగొలను నుంచి పెద్దింట్లమ్మ ఆలయానికి చేరుకోవచ్చు. ఏలూరు నుంచి వయా చాటపర్రు-గుడివాకలంక మీదుగా ఆలయానికి చేరువచ్చు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని



నూజివీడు బైక్ ర్యాలీలో పార్థసారథి

ఆంధ్రను అధ్వానం చేసిన జగన్

» ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కామినేని

కలిదిండి, మార్చి 9: ఆంధ్రను అధ్వానం చేసిన సీఎం జగన్‌ను సాగ నంపాలని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు గోతులు పడి అధ్వానంగా ఉండటంతో రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది వాహన దారులు, ద్విచక్ర వాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంలో జగన్ విఫలమయ్యారన్నారు. ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పటికీ పట్టించుకోకుండా విద్యుత్ ఛార్జీలు పెంచి ఆక్వా రైతుల నడ్డి విరిచారన్నారు. నాసిరకం మద్యం విక్రయించి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయన్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి అరాచక పాలన చేస్తున్న వైసీపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు అంద్రాజు శ్రీనివాస్, గూడవల్లి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, భలే ఏసురాజు, జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బట్టు లీలా కనకదుర్గ, సెంట్రల్ ఆంధ్ర కో-ఆర్డినేటర్ నల్లగోపుల చలపతిరావు, బీజేపీ నాయకులు పైడిపాటి శివశంకర్, పేటేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమంతా టీడీపీ గాలి వీస్తోంది..

» నూజివీడు బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పార్థసారథి

నూజివీడు: నూజివీడు పట్టణంలో తెలుగుదేశం, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నూజివీడు టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా కొలుసు పార్థసారథిని ఎంపిక చేసిన అనంతరం నూజివీడులో భారీ బైక్ ర్యాలీని నిర్వహించటం విశేషం. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నిర్వహించిన ఈ ర్యాలీతో నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ ప్రారంభం అవుతుందని చెప్పవచ్చు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ గాలి వీస్తోందని టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటై సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించటం తథ్యమన్నారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో యువకులు అధిక సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. నూజివీడు పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, మండా శ్రీను, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి ప్రదీప్ కుమార్, జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దాకరంలో మాట్లాడుతున్న జనసేన సమన్వయకర్త బీవీ రావు



మండవల్లి మండలంలో కొడాలి వినోద్ పాదయాత్ర

టీడీపీ-జనసేనతోనే భవిష్యత్తు

ముదినేపల్లి, మార్చి 9 జనసేన - టీడీపీ కూటమిని రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆదరించి తమ భవిష్యత్తుకు మార్గనిర్దేశకులు కావాలని జనసేన కైకలూరు నియోజకవర్గ సమన్వయకర్త బీవీ రావు అన్నారు. శనివారం ఆయన ముదినేపల్లి మండలం దాకరం గ్రామంలో జనసేన జయభేరి పాదయాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి నిర్వహించారు. రానున్న ఎన్నికలు కీలకమైనవని, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయని చంద్రబాబు దక్షత, పవన్ కల్యాణ్ ఆశయాలు మన భవిష్యత్తుకు గ్యారెంటీ కాగలవన్నారు. పార్టీ మండల గౌరవాధ్యక్షుడు పోకల దేవేంద్ర, గోపాలకృష్ణ, నాయకులు నాగనబోయిన విజయ్ కుమార్, నాగదేశి, గణేష్ బాబు, తణుకుల రవితేజ, కోట విప్లవ వరప్రసాద్, దూసనపూడి అశోక్‌బాబు, టీడీపీ నాయకులు రౌతు రాంబాబు, రౌతు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ధర్మపోరాట పాదయాత్ర

మండవల్లి, మార్చి 9: టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ ధర్మపోరాట పాదయాత్ర శనివారం రెండోరోజు సాగింది. మండవల్లి మండలం నందిగామలంక, పెనుమాకులంక, మణుగులూరు, కొవ్వాడలంక, చింతపాడు, దెయ్యంపాడు, కాకతీయనగర్ మీదుగా లోకుమూడి గ్రామానికి పాదయాత్ర సాగింది. గ్రామస్థులకు వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాల్ని వివరిస్తూ టీడీపీ చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ పాలన వద్దు టీడీపీ పాలన ముద్దు అంటూ కొడాలి వినోద్ నినాదాలు చేస్తూ ప్రజలకు వివరించారు. కొల్లేటి లంక గ్రామాల్లో సాగిన పాదయాత్రకు లంక గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ముదినేపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వీరమల్లు నరసింహారావు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు ముంగర ఏడుకొండలు, మోరు రవి, జయమంగళ సురేష్, సరిపల్లి లాజర్, వంగలపాటి ఉషారాణి, వంగలపాటి నాగరాజు, గజ్జల గణేష్, గుండాబత్తిన నాని, ఏసురాజు, గంటసాల వెంకన్న, జయమంగళ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలి ప్రసాద్ మృతికి సంతాపం

ముదినేపల్లి, మార్చి 9 : టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్ ఆకస్మిక మరణం పట్ల పలువురు ముదినేపల్లి మండల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, నాయకులు బొంగు రవికుమార్, పంతగాని సురేష్, యర్రా రాంబాబు, కందేపి పద్మ తదితరులు సంతాపం ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

నూజివీడు ఏఎంసీ ఛైర్మన్‌గా కృష్ణవేణి



నూజివీడు, మార్చి 9: నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కుంబాల కృష్ణవేణి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమెను ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సిఫార్సు చేశారు. ఏడాది కాలపరిమితితో పాలకవర్గం అమల్లో ఉంటుంది. ఏఎంసీ వైస్ ఛైర్మన్‌గా బర్మా సీతారామయ్య, సభ్యులుగా మహ్మద్ అజీజున్నీసా, మద్దాల రూత్‌మేర్సీ జి.లక్ష్మి, ఎదురేసి ఎరకయ్య, అబ్బూరి రంగారావు, ఎం.శ్రీమన్నారాయణ, వనమా సునీత, యు.వెంకటరమణ, చిన్ని నాగమణి, ఆర్.విష్ణువర్ధన్ రావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, పామర్తి శివనాగేశ్వరరావు, చిట్టూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఛైర్‌పర్సన్ కుంబాల కృష్ణవేణి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎస్సీలను మోసగించిన ఎమ్మెల్యే ప్రతాప్ : మరీదు

నూజివీడు టౌన్, మార్చి 9: నూజివీడు రాజకీయ చరిత్రలో దళితులను మోసం చేసిన ఎమ్మెల్యేగా ప్రతాప్ అప్పారావు నిలిచిపోయారని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి, నూజివీడు నియోజకవర్గ నాయకుడు మరీదు శివరామకృష్ణ అన్నారు. నూజివీడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూజివీడు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి 2019లో ఎస్సీలకు రిజర్వ్ చేశారన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని మొత్తం 21 ఏఎంసీలలో 20 ఏఎంసీ పదవులు ఆనాడే ప్రమాణస్వీకారాలు పూర్తి అయ్యాయని, నూజివీడులో మాత్రం నాలుగున్నరేళ్లుగా భర్తీ చేయకుండా ఎమ్మెల్యే తాత్సారం చేశారన్నారు. ఎన్నికలకు ఒక నెల ముందు ఏఎంసీ ఛైర్మన్ పదవి ఇస్తూ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిజంగా ఎస్సీలపై ప్రేమ ఉంటే 2019లోనే మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి భర్తీ చేసేవారన్నారు. ఇప్పటికైనా కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కంబాల కృష్ణవేణికి పదవి ఇవ్వడాన్ని జనసేన స్వాగతిస్తోందన్నారు.



దైవ సేవకుల ఆత్మీయ సమావేశం

నూజివీడు టౌన్, మార్చి 9: నూజివీడు శ్రీ శక్తిభవన్‌లో దైవసేవకుల (పాస్టర్లు) ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఐక్యవేదిక కమిటీ సభ్యులు పాస్టర్ చంద్రకుమార్, పాస్టర్ రమేష్‌బాబు తదితరుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, బ్రదర్ బండి శ్యామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లీగల్ అడ్వైజర్, న్యాయవాది కేజే డిక్సన్ పలు సూచనలు చేశారు. ప్రస్తుత సమాజానికి క్రీస్తు సందేశాలు మార్గదర్శకంగా ఎలా ఉన్నాయి అనే అంశాన్ని వివరించారు. ఐక్యవేదిక కమిటీ సభ్యులు పాస్టర్ రమేష్‌బాబు, స్వర్జన్ రాజు, జ్యోతివరప్రసాద్, జాన్‌వెస్లీ, విజయ్‌కుమార్, దానియేలు, వరప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

చాట్రాయి, మార్చి 9: మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేశామని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అన్నారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన సభలో వైయస్సార్ చేయూత 4వ విడత కింద మండలంలోని 3586 మంది మహిళలకు రూ 6.72 కోట్ల చెక్కును అందజేశారు. మండలంలోని చనుబండ, చాట్రాయి, మర్లపాలెం, తుమ్మగూడెం, యర్రావారిగూడెం, చిత్తపూరు గ్రామాల్లో పలు సీసీ రోడ్లు, భవనాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పోలవరంలో పీఏసీయస్ ఆధ్వర్యంలో నిర్మించనున్న పెట్రోల్ పంప్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ పద్మావతి, రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ రాఘవరెడ్డి, జడ్పీటీసీ అనూష శ్రీరామ్, ఎంపీపీ నిర్మల, నాయకులు పాల్గొన్నారు.

నేడు నూజివీడులో చెక్కుల పంపిణీ

నూజివీడు టౌన్: నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్ వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ చేస్తున్నట్టు వెలుగు ఏపీఎం దయాల రాజశేఖర్ తెలిపారు.

రేపు మాల మహానాడు కార్యాలయం ప్రారంభం

ముదినేపల్లి, మార్చి 9 : మాలమహానాడు, అనుబంధ సంఘాల జిల్లా కార్యాలయాన్ని ఈ నెల 11 ఏలూరులో ప్రారంభించనున్నట్టు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు తెలిపారు. ఈ కార్యాలయాన్ని ఓఎన్జీసీ డిప్యూటీ జీఎం బాయిరెడ్డి మిల్కివే ప్రారంభిస్తారని, రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు చిన్నం సునీల్‌తోపాటు పలువురు నాయకులు, మాలమహానాడు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని బాబూరావు శనివారం విలేకరులకు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముదినేపల్లి, మార్చి 9 ముదినేపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయానికి రూ.11 లక్షల వ్యయంతో చేపట్టిన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, కార్యాలయ ప్రహరీ గోడను శనివారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, శాసనమండలి సభ్యుడు జయమంగళ శంకుస్థాపన చేశారు. అలాగే మండలంలోని లబ్ధిదారులకు రూ.7.55 కోట్ల చేయూత చెక్కులను అందజేశారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్‌లు కైకమ్మ, సుశీల, పీఏసీఎస్ ఛైర్మన్ రమాదేవి, తహసీల్దార్ కుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. అల్లూరులో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ రెడ్డి సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రజాఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు.